# హారం హారం

శ్రీశ్రీ

## సెల్యులాయిడ్‌లో కన్యాశుల్కం

కన్యాశుల్కాన్ని ఫిల్ముతీస్తారని అనధికార వార్తలు వింటున్నాము. 'గద్యం కవీనాం నికషం వదంతి' అన్నట్టు ఫిలింవాళ్ళకి కన్యాశుల్కం అయఃపిండం. ఈనాటికైనా కొందరు సాహసించి ఈ పనికి పూనుకుంటున్నారంటే సంతోషించవలిసిందే.

కాని......

కన్యాశుల్కాన్ని ఫిల్ము తియ్యడం వల్ల "లాభం" లేదనేవాళ్ళతో నాకు పేచీలేదు.

ప్రజల అభిరుచీ, బజార్ల శీతోష్ణతా, దేశంలోని సినీమా భవనాలూ, వాటిలోనిండే జనాల సంఖ్యా, డిస్కౌంటూ, పెర్సంటేజీ, నెట్ ప్రాఫిట్‌లూ ఇవన్నీ ఆమూలాగ్రంగా డెసిమల్ పాయింట్లతో సహా ఏకరువు పెట్టగలిగినవారికి నేను ఒక్కటే ప్రశ్న వేస్తాను. 'కన్యాశుల్కం మీద ఎంత డబ్బు "నష్టం" పొందడానికి సిద్ధమవుతున్నారు?' అని.

అంతే.

నా దృష్టిలో లాభాన్ని ఆశించడం మహాపాపం. నష్టాన్ని ఆహ్వానించడం పుణ్యం. మీరు ఏదైతే నష్టం అనుకుంటున్నారో అదే కొన్నాళ్ళకు మీకు సహా స్పష్టంగా కనిపించే లాభాన్నిస్తుంది.

అందుచేతనే మహాశిల్పానికి పరాజయంలేదు.

ఈ మధ్యను "మహాప్రస్థానం" గీతాలు అచ్చువెయ్యడానికి నా టరమ్సు ఏమిటని కొందరడగవస్తే ఇలాగే అన్నాను. "నాకొక్క దమ్మిడీ కూడా ఇవ్వనక్కరలేదు. నేను కోరిన విధంగా అచ్చువెయ్యడానికి ఎన్నివందల రూపాయలు 'నష్టం' పోవడానికి సిద్ధపడుతున్నారు" అని.

ఒకమారు వేళాకోళానికని 'నా దగ్గరే డబ్బుంటే ఈగీతాలను నిలువుటద్దం సైజులో అచ్చువేయిస్తా' నన్నాను. ఆ యుద్ధపు రోజులలో అది అందరికీ "కీల్పాకు ఊహ" అనిపించింది. ఇప్పుడు మాత్రం......

సరే. ఎందుకు, అప్పుడూ ఇప్పుడూ కూడా నాకీ ఊహ ఆచరణ సాధ్యంగానే కనబడుతోంది.

కన్యాశుల్కంలో మాటలేగాని బొమ్మలు లేవట. అంచేత అది ఫిల్ముకి అనర్హమట. మాటల్ని బొమ్మల్నిగా మార్చేశక్తి మీకు లేదనండి. అదీ న్యాయమైన మాట.

కన్యాశుల్కంలో ఏ ఒక్క పేజీనైనా రెండు వేల అడుగుల ఫిల్ము తీయడానికి అవకాశం ఉందంటున్నాను నేను. మొత్తం నాటకాన్ని పది వేల అడుగులలోకాని, పదిలక్షల అడుగులలోగాని తియ్యడానికి వీలున్నాయి—ఎవరి సొంత కవిత్వాలూ చొప్పించకుండా.

షేక్స్పియరు మాటలనే వాడి మాక్స్ రైన్‌హార్ట్ అనే డైరెక్టరు "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్" ఫిలిం తీశాడు. హాలీవుడ్డువాళ్ళు స్క్రిప్ట్‌ను అనువదించి "రోమియో అండ్ జూలియట్" ను తీశారు. లోకందృష్టిలో రైన్‌హార్ట్‌ది ఓటమి: హాలీవుడ్డుది గెలుపు!,

గిరీశం ఒక బఫూన్ అనీ, కన్యాశుల్కం ఒక ఫార్సు అనీ అనుకునే మనస్సులకు కన్యాశుల్కపు గొప్పతనం దురవగాహం.

ప్రపంచ సాహిత్యంలోని మహాకావ్యాలలో ఒకటిగా కన్యాశుల్కాన్ని పరిగణిస్తున్న వారు కొందరున్నారు. వీరు చాలా తక్కువమంది కాబట్టి వీళ్ళని అవమానించినా ఫర్వాలేదనుకోవడమంత దుర్మార్గం మరొకటి ఉండదు.

కన్యాశుల్కాన్ని తియ్యబోయి కోతిని చెయ్యడం అవమానపు పనికాక మరేమిటి?

గిరీశం, రామప్పంతులు, లుబ్ధావధాన్లు మొదలైనవారు నవ్వుపుట్టించేటట్లు మాటలాడే ట్రాజిక్ హీరోలు. వీరిది శిథిలీకృతమవుతూన్న ఒకానొక సాంఘికవ్యవస్థయొక్క కరాళనృత్యం.

కన్యాశుల్కం భీభత్సరసప్రధానమైన విషాదాంత నాటకం.

ఈ సంగతులేవీ వంటపట్టించుకోకుండా కేవలం ధనైకలొబ్ధ్యంతో కన్యాశుల్కాన్ని ఒక మ్యూజికల్ కామెడీగా తయారుచెయ్యడాన్ని హర్షించలేనివాడు ఈ లోకంలో కనీసం ఒకడైనా ఉన్నాడు.